బియ్యం ఉత్పత్తిలో అగ్రస్థానం గర్వకారణం

- రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌దే
- కేంద్ర ప్రభుత్వ నివేదికపై కేటీఆర్ హర్షం

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన సమయంలో బియ్యం ఉత్పత్తిలో దేశంలో తొలి పది స్థానాల్లో కూడాలేని స్థితి నుంచి ఇవ్వాళ నంబర్ 1 స్థానానికి చేరుకోవడం గర్వంగా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. బియ్యం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ 1 స్థానంలో ఉన్నదని యూనిఫైడ్ పోర్టల్ ఫర్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ (యూపీఏజీ) తాజా నివేదికలో వెల్లడించిన నేపథ్యంలో ఆయన బుధవారం ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తంచేశారు. 'నెర్రెలు బారిన ఈ నేల పచ్చబడింది.. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వతంత్ర భారతదేశ చరిత్రలో మరే రాష్ట్రమూ సాధించని అరుదైన రికార్డు సాధించింది.. దేశానికి అన్నంపెట్టే ధాన్యాగారంగా ఎదిగింది. అందుకు కారణం రైతుబిడ్డ కేసీఆర్ దార్శనికత, కార్యాచరణే' అని కేటీఆర్ ట్వీట్ చేశారు. 'భూగోళం మీద అత్యధిక జనాభా కలిగిన దేశంగా మన ఆహారాన్ని మనమే పండించుకోవాలి కానీ, ఇంకెవరూ మనకు ఆహారం సమకూర్చలేరు' అంటూ కేసీఆర్ తరచూ చెప్పిన విషయాన్ని కేటీఆర్ ఉదహరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మాణం, రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంటు, ధాన్యం కొనుగోళ్లు, కొత్త గోదాములు, రైతు వేదికల నిర్మాణం ఇలా అనేక విప్లవాత్మక విధానాలతో రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరిగి, తద్వారా బియ్యం ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరిందని వివరించారు. దేశంలో మరే రాష్ట్రం సాధించని వ్యవసాయ విప్లవంతో రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు.

రేవంత్ దృష్టిలో డబుల్ ఇంజన్ అంటే మోదానీ

మోదీ+అదానీ.. ఈ ఇద్దరే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిలో డబుల్ ఇంజన్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మోదీ, అదానీకి కావాల్సిన పనులను చక్కబెడుతూ వారి చల్లని చూపు తనపై ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి చూసుకుంటున్నారని విమర్శించారు. మూసీ పుట్టిన ప్రాంతం దామగుండం వద్ద 12 లక్షల చెట్లను నరికేసేందుకు 2,900 ఎకరాల అటవీ భూమిని మోదీ ఆదేశాలకు అనుగుణంగా అదానీకి అప్పగించారని ఆరోపించారు. మూసీ పుట్టే ప్రాంతం నాశనమైనా సరే, బడేభాయ్ ఆజ్ఞను పాటిస్తున్నారని ధ్వజమెత్తారు. మూసీ దిగువన రామన్నపేటలో అంబుజా సిమెంట్ ప్లాంట్ కోసం బూటకపు పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం ద్వారా అదానీని ముఖ్యమంత్రి సంతృప్తి పరుస్తున్నారని ధ్వజమెత్తారు. నిజానికి ఆ భూమిని తెలంగాణలో డ్రైపోర్ట్ కోసం కేటాయించిన విషయాన్ని కేటీఆర్ వివరించారు. మోదీ+అదానీ కోసం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇష్టానుసారంగా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అదానీకి మేలు చేస్తున్నదని మండిపడ్డారు. అందుకు ప్రతిఫలంగా రూ.1.5 లక్షల కోట్లతో మూసీ ప్రాజెక్ట్ సహా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసే అన్ని దుర్మార్గాలు, అవినీతిపై బీజేపీ మౌనం వహిస్తున్నదని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ సర్కార్‌పై అన్ని వర్గాలు ఆగ్రహం

కాంగ్రెస్ సర్కార్‌పై అన్ని వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. 'అన్ని రంగాల్లో వైఫల్యం.. అన్ని వర్గాల్లో ఆగ్రహం.. ఇదీ రేవంత్ సర్కార్ తీరు' అని ఆయన ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. సకల జనులను దగా చేసిందని మండిపడ్డారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు.. ప్రతివర్గం ఆందోళనబాట పడుతున్నదని ఉదహరించారు.

నేడు ఆదిలాబాద్‌కు కేటీఆర్

రైతు నిరసన సభకు హాజరు

ఆదిలాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ గురువారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు నిరసన సభకు హాజరుకానున్నారు. మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం సభా ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, రైతుభరోసా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ సభ నిర్వహిస్తున్నారు.

3 అంతస్తులు దాటితే.. సొంత ట్రాన్స్‌ఫార్మరే

- కరెంట్ వాడకం నెలకు 20 కిలోవాట్లు దాటితే సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాల్సిందే
- ఇప్పటికే గ్రేటర్‌లో వందలాది మందికి నోటీసులు
- ఒక్కో భవన యజమానిపై 2-4 లక్షల భారం



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ):

- వెంగళరావునగర్‌లోని ఒక వ్యక్తిగత నివాస గృహం.. అందులో మొత్తం ఏడు విద్యుత్తు కనెక్షన్లు వాడుకలో ఉన్నాయి. ఈ మొత్తం విద్యుత్తు కనెక్షన్ల నుంచి 29 కిలోవాట్ల విద్యుత్తు వినియోగమవుతున్నది. కాంట్రాక్టెడ్ లోడ్ మొత్తం 29 కిలోవాట్లు ఉండటంతో సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలంటూ శ్రీకృష్ణానగర్ సెక్షన్ ఆపరేషన్స్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆ ఇంటి యజమానికి నోటీసు జారీ చేశారు.
- ఆస్మాన్‌గఢ్ పరిధిలోని వివేకానందనగర్, పీ అండ్ టీ కాలనీలో ఒక ఇంటి యజమానికి మొత్తం 12 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వాటి మొత్తం కాంట్రాక్టెడ్ లోడ్ 25 కిలోవాట్లు దాటింది. దీంతో సొంతం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలంటూ అస్మాన్‌గఢ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆ ఇంటి యజమానికి నోటీసు జారీ చేశారు.

సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వందలాది మందికి విద్యుత్తు శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఒక్క డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ఏర్పాటు చేసుకోవాలంటే ఎంత లేదన్నా ఒక్కో భవన యజమాని రూ.2 లక్షల నుంచి నాలుగు లక్షల దాకా ఖర్చు అవుతుంది. ఎప్పుడో కట్టుకొని అందులో నివాసం ఉంటున్న భవనాలకు ఇప్పుడు విద్యుత్తు శాఖ అధికారులు నోటీసులు ఇవ్వడం ఏమిటని వినియోదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఊహించని రీతితో ఆర్థిక భారాన్ని మోపడం అన్యాయమని ఆక్రందిస్తున్నారు. కొత్తగా నిర్మించే అపార్టుమెంట్లకు, పది కనెక్షన్లకు మించి ఉంటే సొంతం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్తే కొంతవరకు అంగీకరించవచ్చు. కానీ, కొన్నేండ్ల క్రితం ఇండ్లు నిర్మించుకొని, అవసరమైన మేర విద్యుత్తు కనెక్షన్లు తీసుకొని కరెంటు వాడుతుండగా ఇప్పుడు తనిఖీలు చేసి 20 కిలోవాట్లు దాటితే సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

ఓవర్‌లోడ్‌ను అధిగమించే సాకుతో వినియోగదారులపై భారం

దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఫీడర్ల వారీగా సర్వే చేపట్టింది. ఆ సమయంలో సబ్‌స్టేషన్ల నుంచి ఇంటింటికీ విద్యుత్తు సరఫరా చేసేందుకు విద్యుత్తు శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడుతున్నట్టు గుర్తించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 1.85 లక్షల వరకు కాలనీలు, బస్తీలు, అపార్టుమెంట్లలో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిలో అపార్టుమెంట్లు మినహా పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వ్యక్తిగత ఇండ్లకు వెళ్లిన విద్యుత్తు కనెక్షన్లతో ఓవర్‌లోడ్ అవుతున్నట్టు గుర్తించారు. అయితే ఓవర్‌లోడ్ సమస్య ఉన్నచోట ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాల్సిందిపోయి, విద్యుత్తు వినియోగదారులపై భారం మోపేలా సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలంటూ నోటీసులు జారీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది.

సామాన్యులపై ఇంత భారమా?

హుమాయూన్‌నగర్‌లో 15 ఏండ్ల క్రితం బిల్డింగ్ కట్టుకున్నాను. నాతోపాటు నా తమ్ముళ్ల కుటుంబాలే ఉంటున్నాయి. మొత్తం ఆరు కరెంటు మీటర్లు ఉన్నాయి. సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలంటూ విద్యుత్తు శాఖ అధికారులు నోటీసు ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోకుంటే విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని బెదిరిస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్తు స్థంభాలు, కేబుల్స్ అన్ని కలిపి మూడు లక్షల నుంచి నాలుగు లక్షల దాకా ఖర్చు అవుతుందని విద్యుత్తు శాఖ సిబ్బంది చెప్తున్నారు. అంత ఖర్చు మేమెలా భరిస్తాం. విద్యుత్తు శాఖది తప్పుడు నిర్ణయం. దీనిపై ఎంతదాకైనా పోరాటం చేస్తాం. **-ఎంఏ హకీమ్, హుమాయూన్‌నగర్, మెహిదీపట్నం**

నెలాఖరుతో ముగియనున్న విద్యుత్తు కమిషన్ గడువు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ విద్యుత్తు కేంద్రాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ మదన్ బీ లోకూర్ కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనున్నది. దీంతో గడువు పొడిగించాలని విచారణ సంఘం ప్రభుత్వాన్ని కోరనున్నట్టు సమాచారం. జూలై 29న ఈ విచారణ సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. మూడు నెలల్లో నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈ నెల 29తో ఈ విచారణ సంఘం గడువు ముగియనున్నది. ఆగస్టులో బీఆర్కే భవన్‌లోని విచారణ సంఘం కార్యాలయానికి వచ్చి కొన్ని కీలక ఫైళ్లు, డాక్యుమెంట్లను జస్టిస్ మదన్ బీ లోకూర్ ఢిల్లీకి తీసుకెళ్లారు. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి విచారణసంఘం గతంలో నివేదికను రూపొందించగా, ఆయా డాక్యుమెంట్లను జస్టిస్ మదన్ బీ లోకూర్ ఇప్పటివరకు అధ్యయనం చేశారు. తాజాగా బుధవారం బీఆర్కే భవన్‌కు జస్టిస్ మదన్ బీ లోకూర్ వచ్చారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన విచారణపై వారితో చర్చించారు.

దూసుకొస్తున్న 'దానా'.. తెలంగాణకూ వాన!

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీరం వైపు దూసుకొస్తున్నది. గురువారం తెల్లవారుజామున తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉన్నట్టు భారత వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో ఏపీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు ప్రభుత్వాలను ఐఎండీ అప్రమత్తం చేసింది. దానా ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శని, ఆదివారాల్లో వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, ఆదివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ , మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉండటంతో ఎల్లో అలెర్ట్‌ను జారీచేసింది.

పత్తి కొనుగోళ్లు జరిగేనా?

ఆదిలాబాద్ జిల్లాలో రైతుల ఎదురుచూపు

ఆదిలాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో పత్తి దిగుబడులు ప్రారంభమైనా.. కొనుగోళ్లు ప్రారంభంకాలేదు. దీంతో రైతులు చేతికొచ్చిన పంటను నిల్వ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 23న పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నామని ప్రకటించిన అధికారులు ఆ తరువాత వాయిదా వేశారు. దిగుబడులు ప్రారంభమై పది రోజులు దాటినా కొనుగోళ్లు లేకపోవడంతో పత్తిని గ్రామంలో ఆరు బయట నిల్వ ఉంచుతున్నారు. రాత్రీపగలు రైతులు కాపలా ఉంటున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పంట తడిసి నష్టపోకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. సీసీఐ కొనుగోళ్లు లేకపోవడంతో మహారాష్ట్ర నుంచి దళారులు వచ్చి పత్తిని తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పత్తిని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

- **పత్తి కొనాలని ధన్వాడలో రైతుల ధర్నా**

సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నారాయణపేట జిల్లా ధన్వాడలోని రైతువేదిక ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. కొనుగోలు కేంద్రం లేక దళారులు పంటను తక్కువ ధరకు తీసుకోవడంతోపాటు తూకాల్లో మోసం చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. – ధన్వాడ

రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో వర్సిటీల నూతన వీసీలు

విద్యా ప్రమాణాల పెంపునకు కృషిచేయండి

నూతన వీసీలకు గవర్నర్ సూచన

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వర్సిటీల్లో విద్యాప్రమాణాల పెంపునకు కృషిచేయాలని, అకాడమిక్ ఎక్స్‌లెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వీసీలకు సూచించారు. మూడు నెలలకొకసారి సమీక్ష నిర్వహించాలని, మూడు నెలల తర్వాత వీసీలతో సమీక్షాసమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పలు వర్సిటీలకు కొత్తగా నియమితులైన వైస్ చాన్స్‌లర్లు గవర్నర్, వర్సిటీల చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్‌లో ఈ భేటీ జరగగా, పలు అంశాలపై చర్చించారు. వర్సిటీలు పరిశోధనలపై దృష్టిసారించాలని, వీసీలే వర్సిటీలకు లీడర్లు అని, వందేండ్ల చరిత్ర గల ఉస్మానియా సహా అన్ని వర్సిటీలను బలోపేతం చేయాలని వీసీలను గవర్నర్ ఆదేశించినట్టు సమాచారం. సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్‌చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

4న మాజీ సర్పంచుల 'చలో హైదరాబాద్'

పోస్టర్ ఆవిష్కరించిన జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని తాజా మాజీ సర్పంచ్‌లు పోరుబాట తలపెట్టారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ గుడి నుంచి వచ్చేనెల 4న 'చలో హైదరాబాద్ పోరుబాట' కార్యక్రమాన్ని చేపడతామని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ చెప్పారు. పోరుబాట వాల్‌పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. జేఏసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కోశాధికారి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

గ్రూప్ -1 మెయిన్స్‌కు 32% గైర్హాజరు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): గ్రూప్ -1 పరీక్షలకు అభ్యర్థులు భారీగా గైర్హాజరవుతున్నారు. బుధవారం వరకు 32 శాతం మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 31,403 మందికి 21,429 మంది (68శాతం) అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. అయితే ప్రశ్నపత్రం తీరుపై మిశ్రమ స్పందనలొచ్చాయి. ప్రశ్నలు పొడవుగా ఉన్నట్టుగా దీంతో అర్థం చేసుకునేందుకు ఇబ్బందులు పడ్డట్టుగా అభ్యర్థులు తెలిపారు. పరీక్షలో పురాతన, మధ్యయుగ, ఆధునిక, చరిత్ర నుంచి ప్రశ్నలిచ్చారు. అలాగే తెలంగాణ 'మిషన్ కాకతీయ' కార్యక్రమం ప్రాముఖ్యం, దాని లక్ష్యాలు, ప్రయోజనాలపై ప్రశ్నఇచ్చారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు 'మిషన్ కాకతీయ' కార్యక్రమాన్ని చేపట్టగా అది విజయవంతమైంది.

త్వరలో సింగరేణిలో నియామకాలు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థలో త్వరలో 599 ఎక్స్‌టర్నల్, మరో 300 కారుణ్య నియామకాలను పూర్తిచేయనున్నట్టు సంస్థ సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. రెండు వారాల్లో ఉద్యోగాలను భర్తీచేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సింగరేణి భవన్ నుంచి రిక్రూట్‌మెంట్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

చట్టం ముందు 'కులసర్వే' నిలిచేనా?

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఇంటింటి సర్వే
- డెడికేటెడ్ కమిషన్‌ను కాదని ప్లానింగ్ శాఖతో గణన
- అడ్డదిడ్డంగా జీవోలు జారీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రేవంత్ సర్కారు తీరుపై బీసీ మేధావుల్లో అనుమానాలు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించేందుకు, తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు కాంగ్రెస్ సర్కారు సన్నాహాలు చేస్తున్నది. కానీ, ఆ సర్వే నివేదికలు, రాష్ట్ర ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్లు చట్టం ముందు నిలవబోవని బీసీ సంఘాలు, మేధావి వర్గాలు కొట్టిపడేస్తున్నాయి. ఈ సర్వే కోసం రేవంత్‌రెడ్డి సర్కారు అనుసరిస్తున్న విధానం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు పూర్తి విరుద్ధంగా ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంటూ.. బీహార్, మహారాష్ట్రల ఉదంతాలను ఉదహరిస్తున్నా యి. మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను పూర్తిగా నిర్మూలించేందుకే కాంగ్రెస్ స ర్కారు నిబంధనలకు విరుద్ధంగా ఈ సర్వే చేపడుతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చట్టానికి, ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలకు విరుద్ధంగా..

- 1948లో వచ్చిన చట్టం ప్రకారం జనగణన, కులగణన చేపట్టే అధికారం కేంద్రానికే తప్ప రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. ఒకవేళ చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండదు గనుక అమలు చేసే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఏ రాష్ట్రమైనా జనగణన నిర్వహించాలంటే చట్ట సవరణ తప్పనిసరని న్యాయకోవిదులు స్పష్టం చేస్తున్నారు.
- వాస్తవానికి స్థానిక ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం లాటరీ, ర్యాండమ్ లాంటి అశాస్త్రీయ పద్ధతుల్లో రాష్ట్ర ప్రభుత్వాలే నామమాత్రంగా రిజర్వేషన్లు కల్పిస్తుండటంతో వాటిపై న్యాయవివాదాలు తలెత్తడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లపై గతంలో కర్ణాటకకు చెందిన కేఈ కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గావ్లీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను, 'ట్రిపుల్ టెస్ట్' పేరిట పలు మార్గదర్శకాలను జారీ చేసింది.
- ఆ మార్గదర్శకాల ప్రకారం ప్రతి స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు రాజ్యాంగబద్ధమైన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఆ కమిషన్ ద్వారానే బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించాలి. ఆ రిజర్వేషన్లన్నీ కలిపి 50% మించకూడదు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ట్రిపుల్ టెస్ట్ నిబంధనలకు విరుద్ధంగా ముందుకు సాగుతున్నదని కులసంఘాలు, బీసీ మేధావి వర్గాలు మండిపడుతున్నాయి.

ప్లానింగ్ విభాగం చేయడమేంటి?

సుప్రీంకోర్టు ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్ మాత్రమే వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులపై అధ్యయనం నిర్వహించి, దాని ఆధారంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి. కానీ, ఇక్కడ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీహార్ తరహాలో డాటా కలెక్షన్ ప్లానింగ్ బాధ్యతలను డిపార్ట్‌మెంట్‌కు అప్పగించింది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. డాటా కలెక్షన్‌కు కావాల్సిన మానవ వనరులు, ఇతర వసతులు బీసీ కమిషన్‌కు లేవని చెప్తున్నది. ఇది వాస్తవమే అయినప్పటికీ డాటా కలెక్షన్ కోసం నోడల్ ఏజెన్సీగా బీసీ కమిషన్‌కు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌ను అటాచ్ చేసే అవకాశమున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయలేదు. డాటా కలెక్షన్‌ను పూర్తిగా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కే అప్పగించింది. ఈ మేరకు ఈ నెల 10న జీవో 18ని విడుదల చేసింది. ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఎక్కడా స్పష్టమైన వివరాలను పేర్కొనలేదు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, విద్యా, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కులాల వారీగా అని మాత్రమే పేర్కొన్నది. ఎందు కోసం చేస్తున్నామనేది ఎక్కడా పేర్కొనలేదు. ఫిబ్రవరిలో క్యాబినెట్, ఆపై అసెంబ్లీలో చేసిన తీర్మానాలను మాత్రమే రెఫరెన్స్‌గా ఇచ్చింది. కానీ, సమగ్ర ఇంటింటి సర్వే కోసం బీసీ సంక్షేమశాఖ మార్చిలో జారీ చేసిన జీవో 26ను మాత్రం ఎక్కడా రెఫర్ చేయలేదు. ఇవీ కాకుండా బీసీ కమిషన్‌కు టీవోఆర్‌లను నిర్దేశిస్తూ జీవోలను విడుదల చేసింది. వాటిని కూడా రెఫర్ చేయలేదు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన ఉత్తర్వులు అస్పష్టంగానే ఉన్నాయని బీసీ మేధావి వర్గం మండిపడుతున్నది.

బీహార్, మహారాష్ట్ర తరహాలో న్యాయచిక్కులు తప్పవు

కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డదిడ్డంగా జారీ చేస్తున్న మార్గదర్శకాలతో న్యాయచిక్కులు తప్పవని బీసీ న్యాయకోవిదులు హెచ్చరిస్తున్నారు. అందుకు బీహార్, మహారాష్ట్రను ఉదహరిస్తున్నారు. గతంలో బీహార్ ప్రభుత్వం ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో కులగణనను నిర్వహించింది. తద్వారా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల లెక్కలను తీసింది. తదనుగుణంగా ఆయా వర్గాల రిజర్వేషన్లను 65 శాతానికి పెంచింది. దానికి ఈడబ్ల్యూఎస్ కోటాను కూడా కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి పెరిగాయి. దీంతో గతంలో సుప్రీంకోర్టు విధించిన 50% కోటా పరిమితి మించిపోయిందని, బీహార్ ప్రభుత్వం నిర్వహించిన కులగణననే చెల్లుబాటు కాదని పేర్కొంటూ అనేక మంది పాట్నా హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫలితంగా ఆ రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు పెండింగ్‌లో ఉన్నది. చివరికి సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ బీహార్ ప్రభుత్వం తన సర్వే నివేదికను వెల్లడించలేదు. ఇదేవిధంగా మహారాష్ట్ర ప్రభుత్వం సైతం ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలకు విరుద్ధంగా డెడికేషన్ కమిషన్‌ను కాదని డాటా కలెక్షన్ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. దీనికి సుప్రీంకోర్టు అడ్డుచెప్పడంతో మళ్లీ కమిషన్ ద్వారానే డాటా కలెక్షన్ చేయించింది. తెలంగాణ ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. కానీ, జనగణన నిర్వహించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేనందున ఆ సర్వే వివరాలను బీఆర్ఎస్ ప్రభుత్వం వెల్లడించలేదు. డెడికేటెడ్ కమిషన్లు కాకుండా ప్రభు త్వం సేకరించే డాటాకు సాధికారత ఉండబోదని న్యాయనిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందుకు గతంలో ఏపీ ప్రభుత్వం చేపట్టిన సర్వేను ఉదహరిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ హడావుడిలో ఆంతర్యమేంటి?

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయా రాష్ట్రాల తరహాలోనే ముందుకు సాగుతుండడంపై కుల సంఘాలు, మేధావి వర్గాలు అనుమానాలను వ్య క్తం చేస్తున్నాయి. ఈ హడావుడి వెనుక అంతర్యమేంటని ప్రశ్నిస్తున్నాయి. బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినప్పటికీ సుప్రీం మార్గదర్శకాల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదు. ఈ అంశాన్ని న్యాయపరమైన చిక్కుల్లో పడేయాలన్న భావనతోనే రేవంత్‌రెడ్డి సర్కారు నిబంధనలకు విరుద్ధంగా సర్వేను చేపట్టేందుకు సిద్ధమైందని బీసీ మేధావి వర్గం విమర్శిస్తున్నది.

చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- చౌటుప్పల్‌లో భూసేకరణ సమావేశం బహిష్కరణ
- తహసీల్దార్ ఆఫీసు ఎదుట భూనిర్వాసితుల ధర్నా

చౌటుప్పల్, అక్టోబర్ 23: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. 3జీ నోటిఫికేషన్‌లో భాగంగా బుధవారం చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూసేకరణ సమావేశాన్ని మండల పరిధిలోని తాళ్లసింగారం, చిన్నకొండూర్ గ్రామాల రైతులు బహిష్కరించారు. సమావేశానికి వెళ్లకుండా కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్‌కు నాలుగు ప్రధాన రహదారులను 40 కిలోమీటర్ల దూరం కేటాయించి.. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల్లో కేవలం 28 కిలోమీటర్లు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందజేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట కూడా ధర్నా చేసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

- **జీవో 29ని రద్దు చేయాలని ఆందోళన**



గ్రూప్-1 నియామకాల భర్తీలో జీవో 29ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నరసింహారావు డిమాండ్ చేశారు. పాత జీవో 55 పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం కాకతీయ వర్సిటీ లైబ్రరీ ఎదుట నిరసన చేపట్టారు. – హనుమకొండ చౌరస్తా



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మహాధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- విద్యారంగాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబర్ 23: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నాలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి సర్కారు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించడంతో వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆరోపించారు. ఈ నెల 27లోపు సమస్య పరిష్కరించక పోతే చలో ఇందిరాపార్క్ నిర్వహిస్తామని హెచ్చరించారు. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, మేడ్చల్, నిజామాబాద్, కరీంనగ ర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ల ఎదుట, నారాయణపేట జిల్లా మక్తల్ తహసీల్ కార్యాలయం వద్ద, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

ఎన్నికల హామీ ఏమైంది?

- నెల రోజులన్నారు.. 10 నెలలు అయ్యింది
- ఇంకెప్పుడు నెరవేరుస్తారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై సమగ్రశిక్షా ఉద్యోగుల ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): తాము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో రెగ్యులరైజ్ చేస్తామని, మినిమం టైం స్కేల్ వర్తింపజేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ మండిపడింది. నాడు ఓట్లు వేయించుకొని నేడు పట్టించుకోకపోవడం దారుణమని తెలిపింది. బుధవారం కమిటీ నేతలు యాదగిరి, ఝాన్సీ, సౌజన్య, అనిల్‌చారి మాట్లాడుతూ 'కాంగ్రెస్ ఎన్నికల హామీని నమ్మాం. కానీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు అయినా కూడా హామీని నెరవేర్చలేదు. ఈ 10 నెలల కాలంలో సీఎంతోపాటు మంత్రులను పలు సార్లు కలిసి హామీని నెరవేర్చాలని కోరాం. కానీ ఇప్పటికీ ప్రయోజనం లేదు. అందుకే ఈ నెల 26న జరిగే క్యాబినెట్ సమావేశంలో మాకు ఇచ్చిన హామీపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే సమ్మె నోటీసులిస్తాం' అని హెచ్చరించారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో 169 మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని, వీరికి ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. 61 ఏండ్లు నిండిన 100 మంది ఉద్యోగులను తొలగించారని, వీరికి ఎలాంటి ప్రయోజనాలు కల్పించలేదని వెల్లడించారు. సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని లేదా విద్యాశాఖలో విలీనం చేయాలని, తక్షణమే మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలని, ఆరోగ్యబీమా 10 లక్షలు, జీవిత బీమా 10 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 10లక్షల సౌకర్యం కల్పించాలని, ఉద్యోగాల భర్తీలో వెయిటేజీ కల్పించాలని నేతలు డిమాండ్ చేశారు.

మరో 23 మంది లెక్చరర్ల క్రమబద్ధీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): ఇంటర్‌లో మరో 23 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఈ మేరకు విద్యాశాఖ బుధవారం జీవో-35ను జారీచేసింది. వీరు గతంలోనే రెగ్యులరైజ్ కావాల్సి ఉండగా అప్పట్లో అధికారులు వీరిని పక్కనపెట్టారు. క్రమబద్ధీకరించిన వారిలో తెలుగు, హిందీ, ఎకనామిక్స్, సివిక్స్, గణితం, కెమిస్ట్రీ, కామర్స్, బోటనీ సబ్జెక్టుల లెక్చరర్లు ఉన్నారు.